# నవభూమి

## తెలంగాణ

అనుబంధం

03 ఏప్రిల్,2025 గురువారం పేజిలు:2

www.epaper.navabhoomi.in




# ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంపు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపు గడువును ఈ మాసాంతానికి అంటే.. ఏప్రిల్ 30వ తేదీ వరకు పెంచుతూ ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. అసలు అయితే ఈ గడువు మార్చి 31వ తేదీతో పూర్తయింది. కానీ ఈ గడువును పెంచుతూ పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక ఏప్రిల్ 30వ తేదీ వరకు ఎల్‌ఆర్‌ఎస్‌కు 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

మరోవైపు ఈ ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ద్వారా ఇప్పటికే లే అవుట్లను క్రమబద్ధీకరణ చేసింది. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారుగా రూ. 1000 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు సమాచారం. అలాగే ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 15.27 లక్షలు వచ్చాయి. వాటిలో 15,894 దరఖాస్తులను ప్రభుత్వాధికారులు తిరస్కరించారు. ఇక ప్రాసెస్ అయిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 6. 87లక్షలు కాగా.. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రూ. 8.65 లక్షలు పెండింగ్‌లో ఉంది. వీటితో పాటు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తులు 2.6 లక్షలు కాగా.. వాటికి సంబంధించి ప్రొసీడింగ్ ఇచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 58, 032 ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి.

ఇక ఈ ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపు గడువును పెంచడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే.. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ వివరాలను వెబ్‌సైట్ పోర్టల్‌లో పొందు పరిచింది. అయితే అందులోని ప్రభుత్వ ధరలకు.. బయట మార్కెట్ విలువకు పూర్తి వాస్తవ విరుద్ధంగా ఉంది. అలాగే ఎల్‌ఆర్‌ఎస్ కోసం ప్రభుత్వం ఫోన్ నెంబర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఆ నెంబర్ సైతం సక్రమంగా పని చేయడం లేదంటూ ప్రజల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. అలాగే వెబ్ సైట్ పోర్టల్‌లోని అంశాలపై ప్రభుత్వం దృష్టికి ప్రజలు తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అదీకాక ఎల్‌ఆర్‌ఎస్ గడవు సమీపిస్తున్నా.. ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదంటూ పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. అలాంటి వేళ.. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు గడువును మరో నెల రోజులు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ఆదేశాలు జారీ చేసింది.

**హెచ్‌సీయూ భూములు.. హైకోర్టు కీలక ఆదేశాలు**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములపై విచారణను తెలంగాణ హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. సదరు భూముల్లోని చెట్లను గురువారం వరకు కొట్టివేయొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూ వివాదంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ తరఫు సీనియర్ కౌన్సిల్ రవిచంద్.. తన వాదనలు వినిపించారు. జీవో 54ను రద్దు చేయాలని కోరుతూ వాదనలు జరిగాయి. వట ఫౌండేషన్ తరఫున సీనియర్ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఆ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా టీజీఐఐసీకి భూములు అప్పగించారని తెలిపారు.

వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు..

ఈ భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. సదరు భూమిని జాతీయ ఉద్యానవనంగా గుర్తించాలని పిటిషనర్లు.. తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో హైకోర్టు విచారణ చేపట్టింది.

ఆ క్రమంలో న్యాయవాది రవి చందర్ తన వాదనలు వినిపించారు. గత ఏడాది అంటే 2024, జూన్‌లో ప్రభుత్వం 54 జీవో తీసుకొచ్చిందని తెలిపారు. ఈ జీవోలో 400 ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీఐఐసీకి ఇచ్చినట్లు వెల్లడించారన్నారు. ఒక వేళ ఆది ప్రభుత్వ భూమి అయినా సుప్రీం కోర్టు తీర్పుకు లోబడే ప్రభుత్వాలు పని చేయాలని పేర్కొన్నారు. సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం అటవీ ప్రాంతాన్ని కొట్టి వేయాలంటే ముందుగా ఎక్స్‌పర్ట్స్ కమిటీ వేయాల్సి ఉంటుందని గుర్తు చేశారు.

అయితే గత కొన్ని రోజులుగా ఈ భూముల వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయని ఆయన కోర్టు దృష్టికి తీసుకు వెళ్లారు. భారీ వాహనాలు, పెద్ద పరికరాలను వినియోగించి చెట్లను కొట్టేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు నిబంధనలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారంటూ హైకోర్టు దృష్టికి న్యాయవాది రవిచందర్ తీసుకు వెళ్లారు.

అలాగే ఈ చర్యలను అడ్డుకొని.. నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేస్తున్నారని కోర్టుకు తెలిపారు. పోలీసులను వినియోగించి.. ప్రభుత్వం ఈ భూమిలో పనులు చేయిస్తుందని చెప్పారు. ఆ క్రమంలో నిబంధనలు ఉల్లంగిస్తూ పనులు నిర్వహిస్తున్నారని హైకోర్టుకి ఆయన వివరించారు.

ఇక వట ఫౌండేషన్ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి.. హైకోర్టుకు తన వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వం భూములను టీజీఐఐసీకి అప్పగించిందన్నారు. 2003లో 400 ఎకరాలను అప్పటి ప్రభుత్వం ఐఎంజీ అకడమిక్ భారత్‌కు విక్రయించారని వివరించారు. అంటే.. 5-8-2003లో నాడు ఎకరా భూమిని రూ. 50 వేలకు విక్రయించారని తెలిపారు. ఆ సమయంలో ఒక ఎకరం భూమి రూ. 26 లక్షలు విలువ ఉంటే.. కేవలం రూ. 50 వేలకు విక్రయించారని హైకోర్టు దృష్టికి ఆయన తీసుకు వెళ్లారు.

ఇక 2006లో ప్రభుత్వం మారగానే ఈ భూముల విక్రయం.. నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. ఈ నేపథ్యంలో వాటిని వెనక్కి తీసుకుందని తెలిపారు. నాటి నుంచి ఐఎంజీ భారత్ కోర్టులో ఈ భూమి కోసం పోరాడుతుందని గుర్తు చేశారు. ఐఎంజీ కేసులో ఇప్పటి వరకు ఈ భూమి ఫారెస్ట్ ఏరియా అని ఒక్క వాదన కూడా జరగలేదని .. ఈ విషయాన్ని గమనించాలని హైకోర్టును ఆయన కోరారు. అలాగే ఈ భూమి ఎక్కడా ఫారెస్ట్ ఏరియాగా ప్రభుత్వం నోటిఫై చేయలేదన్నారు.

ఇక గూగుల్ మ్యాప్‌లో మాన్సన్ ఏరియా బట్టీ ఫారెస్ట్ ఏరియాగా కనిపిస్తుందని కోర్టుకు తెలిపారు. ఇది కేవలం ఇండస్ట్రీ భూమి మాత్రమేనని.. ఇది ఫారెస్ట్ ఏరియా మాత్రం కానే కాదని ఆయన వివరించారు. ఇక్కడ హెలిప్యాడ్‌లు సైతం నిర్మించారని గుర్తు చేశారు. డిఫెన్స్ మినిస్టర్ వచ్చినా ఇక్కడే హెలికాప్టర్ ల్యాండ్ అవుతుందని కోర్టుకు ఆయన విన్నవించారు.

ఈ వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. గురువారం మధ్యాహ్నం 2.15 గంటలకు ఈ కేసును విచారిస్తామని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గురువారం వరకు ఆ భూమిలో ఎటువంటి చెట్లు నరకవద్దని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# మరోసారి సిట్ విచారణకు శ్రవణ్ రావు




**హైదరాబాద్, ఏప్రిల్ 2:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు శ్రవణ్ రావు వెళ్లారు. సిట్ విచారణకు హాజరయ్యారు. ఇప్పటికే శ్రవణ్‌రావును ఆరున్నర గంటల పాటు పోలీసులు విచారించారు. ఈరోజు మరోసారి ఆయనను పోలీసులు ప్రశ్నించనున్నారు. గత శనివారం శ్రవణ్‌రావును సిట్ బృందం సుదీర్ఘంగా విచారించింది. ఆరున్నరగంటల పాటు విచారించిన సిట్.. శ్రవణ్ రావు నుంచి కొంత సమాచారాన్ని రాబట్టింది. అయితే ఆరోజు పోలీసుల విచారణకు శ్రవణ్ రావు సహకరించకపోవడం, పోలీసులు అడగిన ప్రశ్నలకు దాటవేత ధోరణి అవలంభించడంతో మరోసారి విచారించాలని సిట్ బృందం భావించింది. అందులో భాగంగానే మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో కాసేపటి క్రితమే సిట్ విచారణకు శ్రవణ్ రావు హాజరయ్యారు.

కాగా.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో శ్రవణ్ రావు చాలా కీలకంగా వ్యవహరించారని సిట్ బృందం భావిస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఆరుగురు నిందితులు ఉండగా.. అందులో ఐదుగురు పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వారే. కేవలం శ్రవణ్ రావు మాత్రమే ప్రైవేటు వ్యక్తి. అయితే పోలీసుశాఖ వ్యక్తులతో శ్రవణ్ రావు కుమక్కై ఏ విధంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిపించారనే దానిపై సిట్ బృందం ఫోకస్ చేసింది. కొంతమంది కాంటాక్ట్ లిస్టును శ్రవణ్ రావు సీఐబీ అధికారులకు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఎవరు ఈ కాంటాక్ట్ నెంబర్స్‌ను సమకూర్చారు, రాజకీయ నాయకులకు సంబంధించిన కాంటాక్ట్ వివరాలతో పాటు వారి సంభాషణలు వినాలని ఎవరు శ్రవణ్‌కు సూచించారు అనే అంశాలపైనే సిట్ బృందం ప్రధానంగా దృష్టి సారించింది. శాసనసభ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ రెడ్డికి చెందిన బంధువుల ఫోన్ నెంబర్లు సేకరించి.. వారి ఫోన్లపై కూడా నిఘా ఉంచినట్లు తెలుస్తోంది.

అలాగే ఫోన్ ట్యాపింగ్ చేసేందుకు ప్రత్యేకంగా పరికరాలను తీసుకొచ్చి, వాటిని వివిధ ప్రాంతాల్లో సర్వర్ రూంలుగా ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమంతా నడిపించారు. శ్రవణ్ రావుకు ఓ మీడియా సంస్థ ఉంది. ఆ మీడియా సంస్థ కార్యాలయంలోనే ప్రత్యేకంగా సర్వర్ రూంలను ఏర్పాటు చేసి.. అక్కడి నుంచే ఈ వ్యవహారాన్ని నడిపారు. ఈ వ్యవహారంలో శ్రవణ్ రావుకు ప్రణీత్ రావు సహకరించారు. ప్రణీత్ రావు నేతృత్వంలోనే శ్రవణ్‌రావుకు చెందిన కార్యాలయాల్లో ఫోన్ ట్యాపింగ్ పరికరాలను ఏర్పాటు చేసి.. అక్కడి నుంచే ఫోన్ ట్యాపింగ్‌కు తెరలేపారు. అయితే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని నడిపించినందుకు శ్రవణ్ రావు ఏమైనా ఆర్థికంగా లబ్ధిపొందారా.. ఇదే నిజమైతే ఎవరు ఆయనకు ఆర్థికంగా మద్దతు ఇచ్చారు.. అన్న అంశాలపై సిట్ బృందం విచారించనుంది. గత విచారణలో వీటిపై శ్రవణ్‌ను ప్రశ్నించగా.. సరైన సమాధానాలు చెప్పనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మరోసారి శ్రవణ్‌కు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిపించిన సిట్.. ఆయన నుంచి పూర్తి సమాచారాన్ని రాబట్టే పనిలో పడ్డారు. ఈరోజు సాయంత్రం వరకు సుదీర్ఘంగా శ్రవణ్‌రావును సిట్ అధికారులు విచారించే అవకాశం ఉంది

# ఆ భూములను వేలం వేయడం కుదరదు:బండి



**హైదరాబాద్** కంచె గచ్చిబౌలి భూముల పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలనుకున్న 400 ఎకరాల భూమి అటవీ పరిధిలోనిదని, అటవీ లక్షణాలు కలిగిన ఏ భూమినైనా కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా నరికివేయలేమని సుప్రీం కోర్టు తీర్పులున్నాయని ఆయన అన్నారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమికి సంబంధించి హైకోర్టు లో కేసు నడుస్తోందని, వట ఫౌండేషన్ అనే ఎన్‌జీవో దాఖలు చేసిన కేసులో ఏప్రిల్ 7 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. ఆ భూములను వేలం వేయడం కుదరదని.. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం భూముల చదును పేరుతో కోర్టు ధిక్కారణకు పాల్పడుతోందని బండి సంజయ్ విమర్శించారు. చెట్లను తొలగిస్తూ, మొక్కలను పీకేస్తూ పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతోందని ఆరోపించారు. ఆ భూములను డీఫారెస్టైజేషన్ చేసి అమ్మి రూ. వేల కోట్లు దండుకోవాలనుకోవడం దుర్మార్గమన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మించి కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాలకు కాకుండా ప్రభుత్వ భూములను అడ్డగోలుగా విక్రయించడాన్ని రేవంత్ రెడ్డి గతంలో వ్యతిరేకించిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు.

# ప్రభుత్వ భూమి కబ్జా, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి కాపాడిన పీరంపల్లి గ్రామస్తులు

## వికారాబాద్ మండలం ఎమ్మార్వోఎస్ మండల ఇన్చార్జి శ్రీనివాస్ మాదిగ



**వికారాబాద్ జిల్లా ఏప్రిల్ 02 ( నవభూమి) ప్రతినిధి-** వికారాబాద్ మండలంలోని పిరంపల్లి గ్రామం చివారులో స్మశాన వాటిక దగ్గర్లో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూమినికి చుట్టూ ఫ్రీ కాస్ట్ వేయడం జరిగింది , మండల్ రెవెన్యూ అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన ఫ్రీ కాస్ట్ తొలగించడం జరిగింది, గ్రామంలో ఉన్నటువంటి ప్రజలకు ప్రభుత్వ భూమి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉండాలని ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల రెవెన్యూ అధికారులు , పిరంపల్లి గ్రామస్తులు, చంద్రయ్య, శ్రీనివాసు, కొండాపూర్ రవి, యాదగిరి యాదవ్, నరసింహులు, మధుకర్ రెడ్డి, సురేష్, తదిరులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ సమావేశం

**సిద్దిపేట ఏప్రిల్ 02 ( నవభూమి) ప్రతినిధి-** బీఆర్ఎస్ అధినేత , మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు బుధవారం ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ లో ఉమ్మడి మెదక్ సంగారెడ్డి సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ నేతల తో సమావేశం అయ్యారు. కేటీఆర్ హరీష్ రావు తో పాటు సమావేశానికి ఉమ్మడి మెదక్ జిల్లా కీలక నేతలు హాజరయ్యారు. ఈ నెల 27న వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కేసీఆర్ ఆదేశించారు. ఇప్పటి నుంచే నియోజకవర్గాల వారిగా సన్నాహక సమావేశం పెట్టుకోవాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి లక్ష మందికి తగ్గకుండా లక్షలాది మందితో సభ నిర్వహించేలా ప్లాన్ ఉండాలన్నారు. ఆ దిశగా ఫామ్ హౌస్‌కు చేరుకుంటున్న బీఆర్ఎస్ మాజీ తాజా ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ లు.ముఖ్య నేతలకు కేసీఆర్ సూచనలు చేస్తున్నారు. కాగా ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో నిన్న(మంగళవారం) కేసీఆర్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభ ఏర్పాట్లపై చర్చించారు. బహిరంగ సభ ఏర్పాట్లపై వరంగల్ జిల్లా నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. పార్టీ స్థాపించి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు (%దీ=ా రాఱశ్రీజవతీ యబఎశ్రీఱ జవశ్రీవఎతీఱ్‌ఱశీఅం%) ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ నాయకులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభా ఏర్పాట్లు, నిర్వహణ, జన సమీకరణ వంటి అంశాలపై కేసీఆర్ నేతలకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ ప్రజానీకానికి మనోధైర్యం ఇచ్చేలా బీఆర్ఎస్ సిల్వర్‌జూబ్లీ సభ ఉండాలని కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ సభకు వచ్చే జనానికి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వరంగల్ బహిరంగ సభ తర్వాత గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ కమిటీలు వేసి.. ఆ తర్వాత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. కేసీఆర్ ఆదేశాల మేరకు వరంగల్ సభను విజయవంతం చేస్తామని నేతలు హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో అనేక సభలను నిర్వహించిన ఘనత వరంగల్‌కు ఉందని.. నాటి ఉద్యమ స్ఫూర్తితో మరోసారి పని చేస్తామని చెప్పారు. అభివృద్ధిలో హైదరాబాద్‌తో పోటీపడేలా వరంగల్‌ను తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. బీఆర్ఎస్ సిల్వర్‌జూబ్లీ సభ కోసం ప్రజలు ఆతృతతో ఎదురుచూస్తున్నారని కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తారని చెప్పారు. బీఆర్ఎస్ సభకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పాలన వింతగా ఉందని కామెంట్స్ చేశారు. మార్పు కోరుకున్న రైతుల కళ్లల్లో కన్నీళ్లే మిగిలాయన్నారు. రైతులకు ఈ దుస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదని అన్నారు. ప్రభుత్వ చర్యలతో రైతులు, వివిధ వర్గాల ప్రజలు మనోధైర్యం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# మే 20న కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

## ■ సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు



**వీవనగండ్ల ఏప్రిల్ 3 నవభూమి-** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) వీవనగండ్ల మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బస్టాండ్ ఆవరణలో సిఐటియు మండల నాయకులు జక్కుల ఆశన్న అధ్యక్షతన నిర్వహించిన.ఈ సమావేశానికి సిఐటియు వనపర్తి జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని కార్మికులు సమ్మెలు పోరాటం చేస్తున్న సందర్భంగా వారి దగ్గరకు వచ్చి అనేక హామీలు ఇస్తున్నారని అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ విధానాలనే అవలంబిస్తున్నారని వారు విమర్శించారు కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికులకు కనీస వేతనం 26,000 ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టుకున్నారు. కానీ సంవత్సరం పూర్తయిన కార్మికుల సంక్షేమం గురించి గానీ కార్మికులకు కనీస వేతనాల గురించి గానీ పట్టించుకోవడంలేదని హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి ఇప్పటికీ ఆ బోర్డును ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తుందని కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా లాంటి సౌకర్యాలు ఏవి కల్పించడం లేదని వీరి చేత ప్రభుత్వం ఎట్టి చాకిరి చేయించుకుంటుందని అంగన్వాడి ఆశ ఐకెపి వివో లను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు కోడలుగా విభజించి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని పనిగంటలు పెంచి వేతనాలు తగ్గించి భద్రత లేకుండా కంపెనీ యజమానులకు అనుకూలంగా కార్మిక చట్టాలను సవరించిందని కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామని ఈ సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి సిఐటియు మండల నాయకులు ఏ బాల గౌడు, రంగస్వామి, బాలకృష్ణ చారి, సుగుణ భాయ్, వెంకటయ్య, మధు, రాణి, రాధా, సువర్ణ ,రామన్ గౌడు, ఆంజనేయులు, దర్గయ్య, నీరజ, రాధ, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

## ■ కన్నెపల్లిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కన్నెపల్లి, ఏప్రిల్ 02 ( నవభూమి) ప్రతినిధి-** పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీని ప్రారంభించారు. కన్నెపల్లి మండల కేంద్రంతో పాటు జన్కాపూర్, జజ్జరవెల్లి, టేకులపల్లి, వీరాపూర్, ముత్తాపూర్, నాయకునిపేట, మెట్‌పల్లి, లింగాల గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనేయులు ప్రారంభించారు. కార్యక్ర మంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు అంకూస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయి, మాజీ సర్పంచు చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

వేమనపల్లి : వేమనపల్లి, నీల్వాయి, కేతనపల్లి, ముల్కలపేట, దస్నాపూర్, సుంపుటం, జిల్లెడ , లక్ష్మీపూర్ గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ రమేష్ ప్రారంభిం చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్‌కు మార్, కాంగ్రెస్ నాయకులు సాబీర్ ఆలీ, ముల్కల సత్యనారాయణ, గాలి మధు, ఒడిల రాజన్న, తోకల రాంచందర్, పూర్ణచంద్రరెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

భీమిని : మండలంలో గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అధికారులు, నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాధం లక్ష్మీనారాయణ, తహసీల్దార్ బికర్ణ దాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాధవరపు నర్సింగరావు, కన్నెపల్లి మండల అధ్యక్షుడు రామాంజనే యులు, మాజీ ఎంపీటీసీ దుర్గం ప్రభాకర్, నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమారం : మండలంలో 13 రేషన్ షాపులు ఉండగా కొత్తపల్లి గ్రామంలోని రేషన్ మినహా 12 రేషన్ షాపుల్లో బుధవారం సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైందని తహసీల్దార్ సదానందం తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ అంజమ్మ, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, పోడేటి రవి, మాజీ సర్పంచు గద్దె రాంరెడ్డి పాల్గొన్నారు

# యూనివర్సిటీలో ఇంచు భూమిని కూడా ముట్టుకోం

**హైదరాబాద్ ఏప్రిల్ 02 ( నవభూమి) ప్రతినిధి-**కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై అబద్ధాల మీద బతుకుతున్న కొన్ని రాజకీయ పార్టీలు ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తున్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని యూనివర్సిటీ నుంచి గుంచుకున్నట్లు ప్రచారం జరుగుతోందని.. వాస్తవాలు ప్రజలకు తెలియాలని మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2004లో 400ఎకరాలను ఐఎంజీ భారత్‌కు అప్పటి ప్రభుత్వం అప్పగించిందని మల్లు భట్టి విక్రమార్క గుర్తుచేశారు. దానికి బదులుగా అప్పటి ప్రభుత్వం గోపన్‌పల్లిలోని 397 ఎకరాలు యూనివర్సిటీకి ఇచ్చిందని గుర్తుచేశారు. బిల్లీ రావుకు చెందిన ఐఎంజీ భారత్ అనే ఫ్రాడ్ కంపెనీకి ఇచ్చిన భూ ఒప్పందాన్ని 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. ఆ సంస్థ కోర్టుకు వెళ్లగా.. ప్రజల ఆస్తి ప్రజలకే ఉండాలని ప్రభుత్వం పోరాటం చేసిందని తెలిపారు. రేవంత్ ప్రభుత్వం కొట్లాడి కేసు గెలిచిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఆ విలువైన భూమిని కాపాడామని మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆ భూమిని రెవెన్యూ విభాగానికి, టీజీఐఐసీకి అప్పగించామని..దీన్ని ఎవరైనా అభినందించాలని తెలిపారు. అక్కడకు అంతర్జాతీయ సంస్థలు తెచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఇందులో ప్రభుత్వ స్వార్థం ఏమి లేదని చెప్పారు. కొంత మంది రాజకీయ కుట్రతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. యూనివర్సిటీలో ఇంచు భూమిని కూడా తాము ముట్టుకోమని మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆ యూనివర్సిటీతో తమకు కూడా అనుబంధం ఉందని గుర్తుచేశారు. 400ఎకరాలను కాపాడి తాము ప్రజలకు అందిస్తున్నామని అన్నారు. కొంతమంది వ్యక్తుల కోసం ఆస్తిని తాకట్టు పెట్టమని మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

ఇందిరాగాంధీ హయాంలోనే హెచ్‌సీయూ ఏర్పాటు: మంత్రి పొంగులేటి

కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై రెండు ప్రతిపక్ష పార్టీల నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. అబద్ధాలను నిజాలుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. ఫెవికాల్ బంధం ఉన్న ఆ రెండు పార్టీలకు అక్కడ హై రైజ్ భవనాలు కడితే పర్యావరణం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఆనాడు ప్రభుత్వ పెద్దలు ఆ భూమిని కొట్టేయాలని చూశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.

తాము కొట్లాడి ప్రభుత్వ స్వాధీనం చేస్తే జీర్ణించుకోలేకపోతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. అటవీ ప్రాణులకు అక్కడ నష్టం జరిగిందా.. ప్రత్యేక కమిటీ వేసి విచారణ జరిపిద్దామని సవాల్ విసిరారు. హరగోపాల్, నరసింహా రెడ్డి వంటి ప్రొఫెసర్లు, పర్యావరణ వేత్తలు అక్కడి పరిస్థితి తమకు వివరించారని గుర్తుచేశారు. హెచ్‌సీయూ భూమి ఇంచు తగ్గకుండా దానికే టైటిల్ ఇవ్వాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. విద్యార్థుల ముసుగులో కొందరు అరాచకం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ విషయాన్ని తమ ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. హెచ్‌సీయూ ఏర్పాటు చేసింది ఇందిరాగాంధీ హయాంలోనేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు.

ఆ భూములపై అపోహలు సృష్టిస్తున్నారు: మంత్రి శ్రీధర్ బాబు

కంచె గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ భూములపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అపోహలు సృష్టిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. సర్వే నంబర్ 25లోని 400ఎకరాల భూమి రెండు దశాబ్దాలుగా న్యాయ పోరాటంలో ఉందని తెలిపారు. హెచ్‌సీయూ నుంచి ఇంచు భూమి కూడా ప్రభుత్వం తీసుకోలేదని స్పష్టం చేశారు. కొన్ని పార్టీలతో సంబంధాలు ఉన్న సంఘాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. తాము పని చేయకుండా వారు అడ్డు తగులుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. రిజిస్ట్రార్‌తో తాము సంప్రదింపులు కూడా చేశామని గుర్తుచేశారు. రెండు రోజులుగా కొన్ని పార్టీల నేతలు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.